సాక్షి పల్నాడు

మంగళవారం | 18 | జూలై | 2023



గండాలయ గుడి కిటకిట

మంగళగిరి: గండాలయ స్వామి సోమవారం దర్శనానికి భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమావాస్య హోమం

పిట్టలవానిపాలెం: చందోలు బగళాముఖి గుడిలో సోమవారం రాత్రి 53వ దివ్య అమావాస్య హోమం నిర్వహించారు. చంద్రయాన్ -3 చిహ్నాలతో అమ్మవారిని అలంకరించడం విశేషం.

దశ సహస్ర కదలీ ఫలార్చన



అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి ఆమావాస్య సందర్భంగా సోమవారం దశ సహస్ర కదలీ ఫలార్చన నిర్వహించారు. 10 వేల అరటిపండ్లతో పూజ నిర్వహించారు.

న్యూస్‌రీల్

22న చిలకలూరిపేటలో జాబ్‌మేళా

నరసరావుపేట: చిలకలూరిపేట మార్కెట్ యార్డులో ఈనెల 22వ తేదీన డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జాబ్‌మేళాకు చెందిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్హతను బట్టి రూ.10వేల నుంచి రూ.30వేల వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, డీఆర్ఓ కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి కె.సంజీవరావు పాల్గొన్నారు.

యార్డుకు 37,050 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 37,050 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 34,864 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.11,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి రూ.25,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాకు రూ.12,000 నుంచి 21,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 14,000 నుంచి రూ. 24,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,284 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.


ఐదుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

వినుకొండ (నూజెండ్ల): వినుకొండలోని మహాత్మా జ్యోతీరావ్ పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. సదరు కాపీలు తనకు అందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డీవీ ప్రసాద్ వెల్లడించారు. సస్పెండ్ అయిన వారిలో తెలుగు ఉపాధ్యాయులు టి.బాబూరావు, ఆంగ్ల ఉపాధ్యాయులు కె.లింకన్, సైన్స్ ఉపాధ్యాయురాలు ఎం.రాధ, సోషల్ ఉపాధ్యాయురాలు కె.కన్యాకుమారి, పీఈటీ నాగరాజు ఉన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరుపై ఫిర్యాదులు రావడంతో గత వారం స్థానిక ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పాఠశాలను తనిఖీ చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులైన ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేశారు.

విద్యుత్ వాహనాలతో కాలుష్యం తగ్గుదల

గుంటూరు వెస్ట్: విద్యుత్ వాహనాలతో కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ హితానికి తోడ్పడవచ్చని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇన్‌స్టాల్‌మెంట్ విధానంలో అందించిన విద్యుత్ వాహనాలకు జేసీ జి.రాజకుమారితో కలిసి కలెక్టర్ సోమవారం జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిర ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ నెడ్‌క్యాప్ జీరో పేమెంట్ విధానంలో అందిస్తున్న ఈ వాహనాలను అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 90 నుంచి 100 కిలోమీటర్లు ప్రయాణించే వీలుంటుందని వెల్లడించారు. డీఆర్ఓ చంద్రశేఖరరావు, నెడ్‌క్యాప్ జీఎం వి.కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 517.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 1,350 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.90 అడుగుల వద్ద ఉంది.

టీడీపీలో 'చల్లా'రని సెగలు

- స్క్రిప్ట్, స్క్రీన్‌ప్లే బై అరవింద్
- చంద్రబాబు దృష్టిలో పడేందుకు నిత్యం వివాదాలు
- ఆశావహులు పెరగడంతో అభద్రతభావం
- రౌడీషీటర్ చల్లాకు కాపుకాసి ఘర్షణలకు బీజం
- టీడీపీ నరసరావుపేట ఇన్‌చార్జిపై ప్రజల ఆగ్రహం



సాక్షి, నరసరావుపేట: 'ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో తెలుసుకోనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు' అని కమ్యూనిస్టు నేత లెనిన్ చెప్పినట్టుగానే జరుగుతున్నాయి నరసరావుపేటలో ఘటనలు. ఇక్కడ తెలుగుదేశం పార్టీ సీటు కోసం ఆశావహులు పెరుగుతున్న కొద్దీ అభద్రతభావం పెరిగి.. శాంతిభద్రతలను ఫణంగా పెట్టేవరకు దిగజారారు టీడీపీ నేతలు. తమ అధినేత చంద్రబాబులానే గోబెల్ ప్రచారాన్ని నమ్ముకుని ప్రభుత్వంపై అసత్యాలను పదేపదే ప్రచారంచేస్తూ... ప్రజలను గందరగోళంలోకి నెట్టేందుకు కంకణం కట్టుకున్నారు. ప్రశాంతంగా ఉన్న నరసరావుపేటలో ఘర్షణల పర్వానికి తెరతీసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. టీడీపీ నేతల కుట్రపూరిత ప్రయోజనాలేంటో గుర్తించిన ప్రజలు ఛీకొడుతున్నారు. నరసరావుపేట ప్రశాంతతకు మారుపేరు. రెండు సార్లు వరుసగా గెలిచి నిత్యం ప్రజల్లో ఉంటూ వారి మన్ననలు పొందుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రతిపక్షాలు ఎంతగా రెచ్చగొట్టినా ప్రజాసేవపైనే దృష్టి సారించారు.

టీడీపీలో మూడువర్గాలు

నరసరావుపేట టీడీపీ సీటు కోసం చదలవాడ అరవింద్‌బాబుతో పాటు కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రాము పోటీ పడుతున్నారు. పార్టీ కార్యక్రమాలను మూడు వర్గాలుగా విడిపోయి నిర్వహిస్తున్నారు. అధిష్టానం వద్ద ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఇది మింగుడుపడని ప్రస్తుత ఇన్‌చార్జి చదలవాడ అరవింద్‌బాబు పేటలో వివాదాల అగ్ని రాజేసి.. అందులో చలి కాచుకునేందుకు కుట్ర పన్నారు. ఇందులో భాగంగానే తాజా వివాదానికి ఆజ్యం పోశారు.



కోటప్పకొండ రోడ్డులో ఆదివారం బాధితులపై కర్రతో దాడికి పాల్పడుతున్న అరవింద్‌బాబు

అభాసుపాలవుతున్న అరవింద్‌బాబు

ఎమ్మెల్యే సీటు దక్కదనే భయం పెట్టుకున్న చదలవాడ తన ఇమేజ్ పెంచుకోవడం కోసం అధికార పార్టీపై బురద చల్లేందుకు పూనుకున్నారు. లేనిపోని ఆరోపణలు, బూటకపు వాగ్దానాలు చేసి ప్రజల దృష్టిలో చులకనవుతున్నారు. జొన్నలగడ్డ గ్రామానికి చెందిన వీరాంజనేయులు హత్య పాత కక్షల నేపథ్యంలో జరిగినా దానిని రాజకీయంగా మలుచుకునేందుకు మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని మాయమాటలు చెప్పి, తాము చెప్పినట్టు ఆరోపణలు చేస్తే ఆర్థిక సహాయం చేస్తానని చివరకు ఆ కుటుంబాన్నే మోసం చేశారనే అపవాదును స్వపక్షీయుల నుంచే మూటగట్టుకున్నారు. వరవకట్ట జామియా మసీద్ వివాదంలో జరిగిన హత్యకు రాజకీయరంగు పులిమి ముస్లిం వర్గాలలో ద్వేషం రగిలించేందుకు కుట్రపన్నారని టీడీపీ నేతలే వాఖ్యానిస్తుండటం గమనార్హం. అరవింద్‌బాబు పన్నాగాన్ని గమనించిన మృతుడి కుటుంబీకులు అతనికి దూరంగా ఉన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆస్తులపై అసత్యారోపణలు చేసిన నేపథ్యంలో ప్రతిసవాలుగా గోపిరెడ్డి తగిన ఆధారాలతో తిప్పికొట్టడంతో అరవింద్‌బాబు పలాయనం చిత్తగించారనేది స్థానికుల అభిప్రాయం.

రౌడీషీటర్ కోసం..

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావుపై గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రౌడీషీట్‌ను తెరిచారు. అతనిపై ఇప్పటివరకు 27 క్రిమినల్ కేసులు నమోదుకావడం గమనార్హం. ఆది నుంచి వివాదాస్పద వ్యక్తి అయిన చల్లా సుబ్బారావుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చదలవాడ అరవింద్‌బాబు అండగా నిలవడంపై ప్రజల్లోనే కాదు సొంత పార్టీలోనూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాధితులు టీడీపీ వర్గీయులే

అరవింద్‌బాబుపై సొంత పార్టీ నేతలే గుర్రుగా ఉండటానికి అసలు కారణం ఐపీ పెట్టి ఇంటిని కోల్పోయిన జడ భార్గవ్, అతని తండ్రి శ్రీనివాసరావు టీడీపీ సానుభూతిపరులు. ఆయనకు రూ.లక్షలు అప్పులు ఇచ్చి నష్టపోయిందీ టీడీపీ అనుకూల సామాజిక వర్గానికి చెందిన వారే ఎక్కువ కావడం గమనార్హం. రౌడీషీటర్ అయిన చల్లా సుబ్బారావు కబ్జాకు సహకరించడానికి నరసరావుపేటలో అరవింద్‌బాబు గొడవలు చేయడం టీడీపీ నేతలు ఏ మాత్రం సహించలేకపోతున్నారు. ఐపీ వ్యవహారాన్ని సామరస్యంగా జరిగేలా చూస్తే ఐపీ పెట్టిన, అప్పులిచ్చిన టీడీపీ కుటుంబాలకు ఎంతోకొంత న్యాయం జరిగే వీలుండేదని స్వపక్షీయులు అంటున్నారు. తన అనుచరుడి స్వార్థం, తన రాజకీయ మనుగడ కోసం చదలవాడ ఇలా చేశారని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

నల్లపాటి వర్గం దూరం

కోటప్పకొండ రోడ్డులో ఆదివారం జరిగిన గొడవలో టీడీపీ కార్యకర్తలకు మద్దతుగా నల్లపాటి రాము, అతని అనుచరులు ఎవరూ రాలేదు. సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి చదలవాడతో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వచ్చినా నరసరావుపేటలో ఉంటున్న నల్లపాటి రాము తదితరులు రాకపోవడం గమనార్హం. టీడీపీ సానుభూతిపరులకు ఆర్థికంగా నష్టం జరగడంతోపాటు ప్రజల్లో పార్టీ చులకన అవుతుండటంపై ఆ వర్గం తీవ్ర అసహనంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై టీడీపీ అధినాయకత్వానికీ ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

ప్రజలను ఇబ్బందికి గురిచేస్తే చూస్తూ ఊరుకోం...



నరసరావుపేట టీడీపీలో మూడు వర్గాలు టికెట్ కోసం పోటీపడుతున్నాయి. ఇది వారి పార్టీ అంతర్గత విషయం. కానీ ఎవరికివారు పైచేయి సాధించడం కోసం ప్రశాంతతకు మారుపేరైన నరసరావుపేటలో అలజడులు సృష్టిస్తామంటే ఊరుకునేది లేదు. ఓ రౌడీషీటర్ కోసం టీడీపీ సానుభూతి కుటుంబాలపై అరవింద్‌బాబు దౌర్జన్యం చేస్తుండటం ఆ పార్టీ నేతలకే నచ్చడం లేదు. మీ వర్గపోరుతో పేటలో 144 సెక్షన్ అమలు చేయాల్సి రావడం దురదృష్టకరం.

– డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే

ప్రభుత్వాసుపత్రికి రూ. 9.5 కోట్లు మంజూరు

- వంద పడకల ఆస్పత్రికి నిధులు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వెల్లడి



చిలకలూరిపేట: చిలకలూరిపేటలో కొత్తగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం మరో రూ.9.5 కోట్లు మంజూరు చేసిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వాసుపత్రి చుట్టూ రిటైనింగ్ వాల్‌తోపాటు ఆసుపత్రి ప్రాంగణంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. పనులను వెంటనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.18.5 కోట్లతో ఆసుపత్రి భవనాల నిర్మాణం పూర్తి చేశామని, త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గతంలో ఎన్నికలకు ముందు హడావిడిగా 100 పడకల ఆసుపత్రి నిర్మాణం అంటూ టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారని, పక్కనే ఓగేరువాగు ప్రవహిస్తున్నా కనీసం రిటైనింగ్ వాల్ నిర్మించాలని స్పృహ లేకుండా పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆసుపత్రి నిర్మాణపనులను పరిశీలించి, పునాదుల వద్దనే ఆగిఉన్న పనులను పునఃప్రారంభింపచేసినట్లు తెలిపారు. భవనం బేస్‌మెంట్ లెవెల్ పెంచి నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు. సీహెచ్‌సీగా ఉన్న ఆసుపత్రిని ఏరియా స్థాయికి పెంచినట్టు వెల్లడించారు. రూ.2 కోట్ల నిధులతో అత్యాధునిక పరికరాలు సమకూర్చినట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో మరిన్ని పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గతంలో ఈ ఆసుపత్రిలో కేవలం 15 మంది సిబ్బంది ఉంటే, ప్రస్తుతం 96 మందిని నియమించినట్లు తెలిపారు. ఇప్పుడు ఆసుపత్రిలో డాక్టర్లే 23 మంది ఉన్నారని వివరించారు. త్వరలోనే ఆసుపత్రిని ప్రారంభించి అన్ని రకాల స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు.

రైలు కిందపడి వృద్ధ దంపతుల ఆత్మహత్య



మృత దేహాలను పరిశీలిస్తున్న జీఆర్పీ ఎస్ఐ కొండయ్య

చీరాల రూరల్: వృద్ధాప్యం మీదపడడం, అనారోగ్య కారణాలతో దంపతులు రైలు కిందపడి అర్ధంతరంగా తనువు చాలించారు. ఈఘటన సోమవారం సాయంత్రం చీరాల-వేటపాలెం రైల్వే స్టేషన్‌ల మధ్య దేశాయిపేట వద్ద చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ ఐటీఐ కాలనీ వద్ద నివాసముండే కడప పెద్ద చెన్నయ్య (70), సుబ్బలక్ష్మి(65) దంపతులు. వీరు చేనేత పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. వీరికి రంగస్వామి అనే కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వీరికి వివాహాలయ్యాయి. చెన్నయ్య దంపతులు తన కుమారుడు రంగస్వామి వద్దనే ఉంటారు. అయితే చెన్నయ్యకు తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నాయి. నరాల బలహీనత, నిద్రపట్టకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అతడు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. అతని భార్య సుబ్బలక్ష్మి కూడా బీపీతో బాధపడుతోంది. వైద్యం చేయించుకుంటున్నప్పటికీ చెన్నయ్య అనారోగ్య సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వైద్యం ఖర్చులు కూడా పెరిగిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మనస్థాపం చెందిన దంపతులు విజయవాడ నుంచి చెన్నై వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కిందపడి తనువు చాలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతుల వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి వేగంగా కృషి చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం(ప్రజా ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 311 అర్జీలు సమర్పించారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, రెవెన్యూ అధికారి కె.వినాయకం అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు రెడ్‌క్రాస్ సంస్థ ఉచిత భోజన వసతి కల్పించింది.

టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోండి

నా పేరు ఉన్నవ శ్రీనివాసరావు. యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామ వీఆర్ఏను. నాపై ఈనెల 10న టీడీపీ నాయకులు వేణు, ఉదయలక్ష్మి, రమాదేవి, బ్రహ్మయ్య, వెంకట్రావు, మరికొందరు దాడిచేశారు. కులం పేరుతో దూషించారు. నా గేదె కట్టు విప్పుకుని బజారును వెళ్తున్న ఓ అగ్రవర్ణ మహిళకు తగిలిందనే కారణంతో నాపై దాడి చేసి కొట్టారు. నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలి.

– ఉన్నవ శ్రీనివాసరావు, వీఆర్ఏ, పలువురు రజక సంఘాల నేతలు

పేకాట స్థావరంపై దాడి

- ఎనిమిది మంది అరెస్టు
- జూదరుల్లో టీడీపీ, జనసేన నేతలు
- పోలీసులపై యరపతినేని ఒత్తిడి?

గురజాల : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురజాల నగర పంచాయతీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకుడు ఇంటిలో తెలుగుదేశం, జనసేన పార్టీ నేతలు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో శనివారం రాత్రి దాడి చేశారు. 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.27,070 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు.

పోలీసులకు యరపతినేని ఫోన్!

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులకు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఫోన్ చేసి ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. పేకాట ఆడుతున్న వారిని వదిలి పెట్టాలని అడిగినట్టు తెలుస్తోంది. అయితే పోలీసులు ఒత్తిళ్లకు లొంగకుండా పోలీసులు జూదరులపై కేసు నమోదు చేశారు. వారిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు సీఐ కె.ప్రభాకర్ తెలిపారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తిచేయాలి

అధికారులకు హౌసింగ్ ఎండీ లక్ష్మీశా ఆదేశం



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న ఎండీ లక్ష్మీశా, కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: పేదలందరికీ ఇళ్లపై ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తిచేసి జిల్లాను అగ్రస్థానంలోకి తీసుకు వెళ్లాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇళ్ల లక్ష్యాలను వందశాతం పూర్తి చేయించటంపై కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి ఆయన హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలో ఐదు లక్షల ఇళ్లు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేపట్టాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించిన విషయం గుర్తు చేశారు. జిల్లాలో వెనుకబడిన ఐదు మున్సిపాలిటీలు, మండలాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సమన్వయం చేసుకొని క్షేత్ర స్థాయిలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. రానున్న 15 రోజుల్లో పూర్తి చేసేందుకు అనుగుణంగా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మూడు ఆప్షన్లలో రెండు, మూడు విధానాలను ఉపయోగించి పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. పథకం అమలులో ఎక్కడ ఇబ్బందులు వచ్చినా, వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, గృహనిర్మాణ శాఖ పీడీ వేణుగోపాలరావు, డీఈలు అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

10,047 గృహాలను పూర్తిచేయాల్సిందే..

జిల్లాలోని జగనన్న కాలనీల్లో ప్రభుత్వం నిర్దేశించిన 10,047 గృహాల నిర్మాణాన్ని పూర్తిచేసి లక్ష్యం చేరుకోవాలని ఏపీ గృహనిర్మాణ సంస్థ హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా హౌసింగ్ ప్రత్యేకాధికారి లక్ష్మీశా ఆదేశించారు. సోమవారం వినుకొండరోడ్డులోని జగనన్న కాలనీని హౌసింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పి.వేణుగోపాలరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, అధికారులు పాల్గొన్నారు.

నకిలీ సిగరెట్ల కలకలం

- ప్రముఖ బ్రాండ్ పేరుతోనే విక్రయాలు
- విజిలెన్స్ దాడులతో బట్టబయలు
- రూ.10.60 లక్షల విలువైన నరకు స్వాధీనం



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు



పట్టుబడిన నకిలీ సిగరెట్ ప్యాకెట్లు

చిలకలూరిపేట: కొన్నేళ్ల నుంచి ఎలాంటి కంపెనీ పేరు లేకుండా బ్యాచ్ నంబర్ లేకుండా, ఏ ప్రాంతంలో తయారవుతుందో కనీసం తెలియకుండా కొన్ని రకాల పేర్లతో కూడిన సిగరెట్లు మార్కెట్‌లో విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయి. ఉదాహరణకు ప్యారిస్, గోల్డ్ విమల్, గోల్డ్ స్టెప్ వంటి సిగరెట్ల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అయితే ఇప్పుడు ఒక అడుగు ముందుకు వేసి ఏకంగా ఐటీసీ బ్రాండ్ పేరుతో అత్యధిక విక్రయం కలిగిన గోల్డ్‌ఫ్లేక్ బ్రాండ్ సిగరెట్లు నకిలీవి లభించటం అధికారులనూ విస్మయానికి గురిచేసింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఈనెల 15న ఉమ్మడి గుంటూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో హోల్‌సేల్‌గా సిగరెట్లు విక్రయించే దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి.

మక్కీకిమక్కీ..

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం దాడిలో ముఖ్యంగా ఐటీసీ బ్రాండ్ నేమ్‌తో కూడిన గోల్డ్‌ఫ్లేక్ కింగ్‌సైజ్ సిగరెట్ ప్యాకెట్ల బండిల్స్ లభ్యమయ్యాయి. వీటితోపాటు అన్‌బ్రాండెడ్ విదేశీ సిగరెట్లు కూడా లభ్యమయ్యాయి. చిలకలూరిపేట పట్టణంలోని చికోటి ఎంటర్ ప్రైజెస్, బాల సుజాత జనరల్ స్టోర్స్, సాయి ట్రేడర్స్ అనే మూడు హోల్‌సేల్ దుకాణాలపై దాడి చేయగా వీరి వద్ద నుంచి రూ. 7 లక్షల విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లు లభించాయి. ఈ దాడులతో పట్టణంలోని మిగిలిన దుకాణాలు మూసివేయడం గమనార్హం. దీనిని బట్టి ఇంకా పలువురి వద్ద నకిలీ సిగరెట్ల నిల్వలు ఉండే అవకాశం పుష్కలంగా ఉందని అర్థమవుతోంది. వీరికి సిగరెట్లు ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయో అనే అంశంపై ఆరా తీయగా, బాపట్ల జిల్లా పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలోని కొత్తమాసు సుధాకర్ సరఫరా చేస్తున్నట్లు దుకాణదారులు చెప్పడంతో అదే రోజు అతడిపై అధికారులు దాడి చేశారు. అతని వద్ద కొంత సరకు లభించింది. ఒక్కరోజులో దొరికిన నకిలీ సిగరెట్ల విలువ మొత్తం రూ.10.60 లక్షలుగా విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. నకిలీ సిగరెట్లు మక్కీకిమక్కీ అసలైనవిలానే ఉండడం విజిలెన్స్ ఉన్నతాధికారులనూ ఆశ్చర్యపరిచింది. ఈ సిగరెట్ల సరఫరా హైదరాబాద్ నుంచి జరుగుతున్నట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలినట్టు సమాచారం.

పూర్తిస్థాయిలో దర్యాప్తు

నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేశాం. ఐటీసీ కంపెనీ బ్రాండ్ పేరుతో కూడిన నకిలీ సిగరెట్లు లభ్యమయ్యాయి. 14 అంకెల యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఇతర ఆధారాల వల్ల అవి నకిలీవని గుర్తించాం. ప్రాథమిక విచారణలో హైదరాబాద్ నుంచి సరఫరా అవుతున్నట్లు తెలిసింది. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నిందితులపై చర్యలు తీసుకుంటాం.

– కె ఈశ్వరరావు, ఎస్పీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఉమ్మడి గుంటూరు జిల్లా

సమాజానికి దిక్సూచిగా వ్యవహరించాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల: సమాజానికి దిక్సూచిలాగా మీడియా వ్యవహరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జిల్లా సమాచార, పౌర సంబంధాలశాఖ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరాలకు మీడియా అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జరిగింది. బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా మీడియా వారికి అక్రిడిటేషన్లు ఇవ్వడం సంతోషదాయకమని కలెక్టర్ అన్నారు. విలేకరులకు హెల్త్ కార్డులు జారీ చేయడానికి అన్నిచర్యలు తీసుకోవాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీపై చేర్పించే అంశాన్ని నిబంధనలు అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. మీడియా అక్రిడిటేషన్లను బాపట్ల జిల్లాలో తొలిసారిగా ఇస్తున్నామని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు కె.సుభాషిణి చెప్పారు.

టీడీపీ నాయకులను కఠినంగా శిక్షించండి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, బాధితులు

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను కోరిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- బాధితులతో కలిసి వినతిపత్రాలు అందజేత

నరసరావుపేట: టీడీపీ నాయకుడు చల్లా సుబ్బారావు ఆక్రమణలో ఉన్న రూ.70లక్షల విలువైన ఇంటిని విడిపించి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని బాధితులు అందరికీ న్యాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిలను కోరారు. ఈ ఇంటి విషయంలో ఆదివారం సాయంత్రం దౌర్జన్యం చేసి బాధితులపై దాడిచేసిన టీడీపీ నాయకులపై కేసులు నమోదుచేసి వారి ఆగడాలను అరికట్టాలని కోరారు. ఈ మేరకు సోమవారం వారిద్దరినీ కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో బాధితులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. బాధితులు అందరికీ టీడీపీ వారి నుంచి రక్షణ కల్పించాలన్నారు. సంఘటనకు సంబంధించి టీడీపీ నాయకుల దౌర్జన్యాలకు చెందిన వీడియోలను కలెక్టర్, ఎస్పీలకు చూపించారు. పార్టీ కార్యాలయంలో బాధితులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి సంఘటనకు సంబందించిన వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన జడా శ్రీనివాసరావు మూడేళ్ల నుంచి ఒక స్కీమును ప్రారంభించాడన్నారు. కొన్ని కారణాలతో నష్టాలకు గురై గుండెపోటుకు గురయ్యాడన్నారు. లండన్‌లోని అతని కుమారుడు భార్గవ వద్ద నివాసం ఉంటున్నాడన్నారు. కుమారుడి పేరుతో కోటప్పకొండ రోడ్డులో రూ.70లక్షలు విలువచేసే ఇల్లు ఉందన్నారు. శ్రీనివాసరావు స్కీములోని 400 మందికి డబ్బులు రావాల్సి ఉందన్నారు. వారందరూ డబ్బుల కోసం ఎదురుచూస్తున్న సమయంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, రౌడీషీటర్ చల్లా సుబ్బారావు ఆరునెలల కిందట రూ.40లక్షలకు ఆ ఇంటిని కొన్నట్లు నకిలీ అగ్రిమెంట్ ఒకటి సృష్టించి జనవరి నెల నుంచి బలవంతంగా ఆ ఇంటిని తన స్వాధీనంలో ఉంచుకున్నాడన్నారు. ఈ విషయమై అడిగేందుకు బాధితులు వెళ్లగా సుబ్బారావుకు మద్దతుగా టీడీపీ నాయకుడు డాక్టర్ అరవిందబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి దౌర్జన్యానికి దిగారన్నారు. అరవిందబాబు స్వయంగా కర్రతో దాడిచేసి మహిళలను సైతం కొట్టి పెట్రోలు పోసి తగలపెడతానని హెచ్చరించాడన్నారు. దీనిపై ఎల్లోమీడియాలో వైఎస్సార్ సీపీ వారు ఆక్రమించినట్లు తప్పుడు రాతలు రాశారన్నారు. మొదట దాడిచేసింది అరవిందబాబు, టీడీపీ నాయకులేనని, ఆ తర్వాతనే మిగిలిన సంఘటనలు జరిగాయన్నారు. ఒరిజినల్ డాక్యుమెంట్‌ను ఎమ్మెల్యే విలేకర్లకు చూపించారు. పార్టీలకతీతంగా అందరికీ న్యాయం జరగాల్సి ఉందన్నారు. టీడీపీ వారి ఆక్రమణను తాము అడ్డుకున్నామన్నారు. ఇంటిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని సమానంగా పంచాలన్నారు. అప్పటివరకు ఎవరూ ప్రవేశించకుండా సీఆర్‌పీ 145 సెక్షన్ ప్రకారం ఇంటిని స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. నరసరావుపేటలో శాంతిభద్రతలను కాపాడాలన్నారు. దాడిలో పాల్గొన్న వారందరికీ కఠిన శిక్ష విధించాలన్నారు. జడా నుంచి రావాల్సిన సొమ్ము గురించి బాధితులు వివరించారు.

సమస్యల పరిష్కారానికి తక్షణం స్పందించండి

- జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ
- అర్జీదారులకు అన్నదానం



జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి సమస్యను వివరిస్తున్న బాధితుడు

నరసరావుపేట: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ప్రజల నుంచి 56 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో కుటుంబ, ఆర్థిక, ఆస్తి, తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు వారి ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. స్పందనకు వచ్చిన వారికి పట్టణానికి చెందిన మిట్టపల్లి చంద్రమోహన్‌రావు చేసిన ఉచిత అన్నదానంను జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు ప్రారంభించి వడ్డించారు. ప్రవల్లికా సత్యం ఆర్గనైజర్‌గా వ్యవహరించారు. ఏఆర్ అదనపు ఎస్పీ డి రామచంద్రరాజు, క్రైం అదనపు ఎస్పీ ఎస్‌కె చంద్రశేఖర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, డీఎస్పీలు కె.వి మహేష్, పల్లపురాజు, బి.ఆదినారాయణ, దిశ డీఎస్పీ యు.రవిచంద్ర సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10లక్షల విలువైన బంగారం పోయినా కేసు కట్టలేదు

విజయవాడలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేసే నేను గత మే నెలలో అత్తగారింటికి వచ్చాను. గత నెల జూన్‌లో తిరిగి వెళ్లే సమయంలో రూ.10లక్షల విలువైన బంగారు నగలు బ్యాగులో పెట్టి ఇంటి సమీపంలోని ఆలయంలో స్వామికి పూజ చేసేందుకు వెళ్లాను. తిరిగి వచ్చి బ్యాగుతోపాటు ఆటోలో రైల్వేస్టేషన్ వరకు వెళ్లి బ్యాగు పరిశీలించగా నగలు కన్పించలేదు. పోలీసులకు ఫిర్యాదుచేస్తే కేసు నమోదు చేయలేదు. ఇప్పటికైనా కేసు నమోదు చేయించి దర్యాప్తుచేసి నా నగలు నాకు ఇప్పించగలరు.

–ఆవుల అనంత శ్రీదేవి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, విజయవాడ

కొప్పరపాడు పీహెచ్‌సీకి 14 పోస్టులు మంజూరు

బల్లికురవ: ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఒక్కోదానికి ఇరువురు వైద్యులతోపాటు 14 పోస్టులు మంజూరైనట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ సోమవారం తెలిపారు. రాష్ట్రంలో 88 పీహెచ్‌సీలు మంజూరు కాగా జిల్లాలో కొప్పరపాడు, ఏల్చూరు, దోనెపూడికి కొత్త పీహెచ్‌సీలు మంజూరు చేసినట్లు జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు చెప్పారు. ఇప్పటికే కొప్పరపాడు పీహెచ్‌సీకి ఇరువురు వైద్యులను కేటాయించామని, ఈ మాసాంతంలో 14 పోస్టులను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారని చెప్పారు. గుంటుపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న వల్లాపల్లి, ముక్తేశ్వరం, వైదన, ఎస్‌ఎల్ గుడిపాడు, కొమ్మినేనివారిపాలెం, కొప్పరపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, కూకట్లపల్లి సబ్ సెంటర్లు కొప్పరపాడు పీహెచ్‌సీలోకి బదలాయించినట్లు వైద్యాధికారి తెలిపారు.

అధిక దిగుబడులు సాధించిన రైతులకు సత్కారం



కలెక్టరేట్‌లో సత్కారం పొందిన రైతులతో జిల్లా కలెక్టర్ శివశంకర్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కొండారెడ్డి

రైతుకు వందనంలో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం రైతుకు వందనం కార్యక్రమంలో భాగంగా ఆదర్శ రైతులను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కాటన్, అఖిరా, సిరి వంటి పంటల ద్వారా అధిక లాభాలు పొందిన గురజాల నియోజికవర్గంలోని జంగమహేశ్వరపురం గ్రామానికి చెందిన రైతు చవ్వా సొరెడ్డి, వారిగ, కంది పంటపై అధిక లాభాలు గడించిన సిరుకమినిపురం వాసులు గుర్రం లక్ష్మణ్, బాణావత్ జితేంద్ర నాయక్, ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి పంటలో అధిక దిగుబడులను పొందిన మాచవరం మండలం సిగరాయపాలెం తండాకు చెందిన రైతు బాణావత్ బలనాయక్‌లను సత్కరించారు. ఉద్యాన పంట విభాగంలో బత్తాయి పంటలో అధిక లాభం పొందిన దుర్గి మండలం ముటుకూరు రైతు ఏచూరి సాయిశంకర్, దానిమ్మ పంట ద్వారా అధిక రాబడి పొందిన వెల్దుర్తి మండలం గంగులకుంట గ్రామ రైతు సబ్బసాని చినకోటిరెడ్డిని సముచిత రీతిలో సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, వ్యవసాయ శాఖాధికారి ఐ.మురళి, హార్టీకల్చర్ అధికారి బీజే. బెన్ని పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు జిల్లా కలెక్టర్ ప్రశంసలు

నరసరావుపేట: ప్రకృతి వ్యవసాయ విధానంలో పలు పంటలు పండిస్తున్న వ్యవసాయ రైతులకు కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రశంసల జల్లు కురిపించారు. సోమవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాలులో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించినటువంటి పలు రకాల ఆహార ఉత్పత్తులు, కూరగాయల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వినుకొండ డివిజన్, గురజాల డివిజన్‌కు చెందిన రైతులు బండారు వెంకటేశ్వర్లు, దేవరకొండ బ్రహ్మానందరెడ్డి పండించిన అనేక రకాలైన ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు. ఇవి ఆరోగ్యపరమైన, ప్రకృతి సిద్ధమైన పంట ఉత్పత్తులు అన్నారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి బీజే బెన్నీ, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే.అమలకుమారి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కారంచేడు మృతులకు ఘననివాళి

సంస్మరణ సభకు హాజరైన బాధిత కుటుంబాలు, దళిత నాయకులు



మృతవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న రచయిత్రి జూపాక సుభద్ర

చీరాల రూరల్: మారణకాండలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ఘన నివాళులర్పించారు. కారంచేడు గ్రామంలో భూస్వాముల చేతిలో ప్రాణాలు కోల్పోయిన మృతవీరులకు బాధిత కుటుంబాల సభ్యులు, దళిత, ప్రజా సంఘాల నేతలు విజయనగర్ కాలనీ సమీపంలో రుధిర క్షేత్రం వద్ద సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుడ్డు భాస్కరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంస్మరణలో పలువురు దళిత సంఘాల నేతలు, ప్రొఫెసర్లు, విప్లవ రచయితలు పాల్గొని మాట్లాడారు. 38 ఏళ్ల క్రితం కారంచేడు గ్రామంలో జరిగిన చిన్నపాటి వివాదంలో అగ్రవర్ణ భూస్వాములు మాదిగపల్లెపై దౌర్జన్యకాండ జరిపి వెంటాడి, వేటాడి ఆరు నిండు ప్రాణాలను బలితీసుకున్నారన్నారు. ఎంతోమందిని క్షతగాత్రులను చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి దారుణమైన ఘటనను సభ్య సమాజం ఏమాత్రం హర్షించదన్నారు. దళితుల రక్షణకు అనేక కొత్త చట్టాలు వస్తున్నప్పటికీ దేశంలో ప్రతి నిత్యం దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు ఆగడంలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే దళితలంతా ఐకమత్యంతో ఏకతాటిపై నిలవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విప్లవ రచయితల సంఘ సభ్యులు ఉషా ఎస్.ధాని, రచయితలు కృపాకర్, జూపాక సుభద్ర, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బాబురావు, పోతుల సురేష్, దళిత నాయకులు తేళ్ల వెంకట స్వామి, తేళ్ల సుబ్బారావు, బుడంగుంట్ల లక్ష్మి నరసయ్య, సిర్రా భగత్ సింగ్, గొర్రెపాటి రవికుమార్, తేళ్ల లక్ష్మి ప్రసాద్, దుడ్డు ఏసుపాదం, తేళ్ల దేవదానం, తేళ్ల ప్రసాద్, వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: తైక్వాండో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలతో ఇద్దరు బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున తెనాలికి చెందిన కేఎస్‌కే తైక్వాండో అకాడమీ క్రీడాకారులు కె.భువనశ్రీ, పి.హరిణి పాల్గొన్నట్లు కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అంతే కాకుండా మహారాష్ట్రలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు వీరి ఎంపికైనట్లు చెప్పారు. వీరిని అకాడమీలో సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ఏపీ తైక్వాండో జనరల్ సెక్రటరీ కె.వెంకటేశ్వరరావు, కృష్ణా, పాల్గొన్నారు.

సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

జెడ్‌బీఎన్‌ఎఫ్ జిల్లా డీపీఎం వాణిశ్రీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం వాణిశ్రీ

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని జెడ్‌బీఎన్‌ఎఫ్ బాపట్ల జిల్లా డీపీఎం వాణిశ్రీ అన్నారు. పిట్టలవానిపాలెం గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు ఐసీఆర్పీలకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చి రొట్ట పైర్లుగా జనుము, జీలుగ, పిల్లిపెసరలతో పాటు 30 రకాల తృణధాన్యాలను చల్లుకోవాలని తెలిపారు. 40 రోజుల తర్వాత పైరును వేర్లను పొలంలోనే ఉంచి మొక్కలను తొలగించాలని తెలిపారు. తద్వారా భూమి సారవంతమవుతుందని తెలిపారు. ఈవిధానంలో సాగు చేయడం వలన గతేడాది బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం గోవాడ గ్రామంలో ఎకరానికి 45 బస్తాల దిగుబడి లభించిందని తెలిపారు. ఈవిధానంపై రైతులు ఆసక్తి చూపాలన్నారు. గ్రామానికి చెందిన రాజారత్నం అనే రైతు పొలంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐసీఆర్‌పీలు, రైతులు ఉన్నారు.

20న అఖిలపక్ష రైతు సంఘాల జిల్లా సదస్సు

పాత గుంటూరు: ఈ నెల 20న అఖిల పక్ష రైతు సంఘాల జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్ తెలిపారు. బ్రాడీపేటలోని పి.ఎల్.రావు భవన్‌లో సోమవారం రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వేల్పూరి నరసింహారావు అధ్యక్షతన రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం సోమవారం నిర్వహించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కళ్లం రాజశేఖర్ రెడ్డి, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, ఎ.ఐ.కె.ఎఫ్. జిల్లా కార్యదర్శి కాల్వ శ్రీధర్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఐటీ రిటర్న్స్‌లో సపోర్టింగ్ డాక్యుమెంట్స్ జత పరచాలి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగులు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇన్‌కమ్‌ట్యాక్స్ పొందుపరిచే దస్తావేజులు, అనంతరం రిటర్న్స్ కోసం పంపించే సపోర్టింగ్ డాక్యుమెంట్‌లను క్షుణ్ణంగా పరిశీలించి పంపించాలని జిల్లా ఖజానా శాఖ అధికారి బి.రాజగోపాలరావు సోమవారం తెలిపారు. ఈ మేరకు సంబంధించి అన్ని ప్రభుత్వ శాఖల డీడీఓలకు లేఖలు పంపించారు. ప్రభుత్వ ఉద్యోగులు రిటర్న్స్, క్లెయిమ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆయా ఎస్టీఓ కార్యాలయాలు, జిల్లా ఖజానా కార్యాలయాన్ని, సంబంధిత శాఖల డీటీఓలను సంప్రదించాలని కోరారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవల ద్వారానే మన్ననలు

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



చాంబర్‌లో అధికారులతో సమావేశమైన జిల్లా జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించడం ద్వారా ప్రజలందరి మన్ననలు పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించే అంశంపై సోమవారం సాయంత్రం తొలిసారిగా జిల్లా నోడల్ అధికారి హోదాలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన సేవలందించే విషయంలో అధికారులంతా తప్పనిసరిగా నిబంధనలను పాటిస్తూ సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతినెలా వినియోగదారులు, వ్యాపారులకు, సేవలందించే అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా తక్షణ స్పందించి విచారణ చేపట్టి నివేదికల అందజేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారుల్లో చైతన్యం వచ్చేలా కృషిచేసే అధికారులు పాటించాల్సిన నిబంధనలను, బాధ్యతలను జిల్లా జాయింట్ కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా వినియోగదారులకు జరుగుతున్న మోసాలలో తూనికలు–కొలతలు, నిత్యావసర సరుకులు అమ్మకం, ఆహార భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌరసరఫరాలు, ఏపీఎస్‌ఆర్టీసీ కేంద్రాలు, ఔషధ నియంత్రణ, విద్యాశాఖ, విద్యుత్తు, మున్సిపల్ శాఖ, గ్యాస్, పెట్రోల్ బంకులు, హోటళ్లు, తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. సమావేశంలో డీఎస్‌ఓ పద్మశ్రీ, డీఈవో కె.శామ్యూల్, ఆహార భద్రతాధికారి లక్ష్మీనారాయణ, తూనికలు కొలతల శాఖ అధికారి అల్లూరయ్య, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సేల్స్ అధికారి అశోక్, ఏపీఎస్‌ఆర్టీసీ డీపీటీవో శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు, ఏఎస్‌వో బాష పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

పట్నంబజారు: పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పేదలకు మంచి చేయాలని సీఎం జగన్ కృషి చేస్తుంటే టీడీపీ నేతలు మాత్రం పెత్తందారిలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజధాని ప్రాంతంలో ఇళ్లు ఇస్తుంటే దీనిపై కోర్టు, ఇతర సంస్థలను టీడీపీ నేతలు ఆశ్రయించటం సిగ్గుచేటన్నారు. కచ్చితంగా ఈనెల 24వ తేదీ సీఎం వైఎస్ జగన్ పేదలకు ఇళ్లు పంపిణీ చేస్తారని స్పష్టం చేశారు. చంద్రబాబు మాదిరిగా రాజధాని గ్రాఫిక్స్ చూపించడం లేదని, పక్కా పేదలకు ఇళ్లు పంచుతున్నారని వివరించారు. ఇండస్ట్రీయల్ ప్రాంతమని కొంత మంది వ్యాఖ్యలు చేస్తున్నారని, 50 వేల ఎకరాల భూముల్లో పేదలకు ఇళ్లు అందజేసినంత మాత్రానా నష్టమేమిలేదని హితవు పలికారు. బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు జగన్ అన్ని వేళలా అండగా నిలబడతారని పేర్కొన్నారు.